క్లుప్తంగా

రాష్ట్ర ప్రగతిని చాటేలా దశాబ్ది ఉత్సవాలు



కిష్టాపూర్‌లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

నేరడిగొండ: రాష్ట్ర ప్రగతిని చాటేలా సీఎం కేసీఆర్ సారథ్యంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండలంలోని లింగట్ల, కిష్టాపూర్, శంకరపూర్ గ్రామాలకు రూ.2 కోట్ల 43 లక్షలతో నిర్మించే తారు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిలో రాష్ట్రంలోనే బోథ్ నియోజకవర్గం ముందుంజలో ఉందని తెలిపారు. జెడ్పీటీసీ అనిల్ జాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్ష నేడు సంపూర్ణమవుతుందని అన్నారు. ఎంపీపీ రాథోడ్ సజన్, ఐటీడీఏ జిల్లా అధికారి భీంరావు, సర్పంచులు సాబ్లే స్వర్ణాంజలి, గీత, నాయకులు అల్లూరి శివారెడ్డి, తిత్రే నారాయణసింగ్, దావుల భోజన్న, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీ యువతికి పోస్టల్ శాఖలో ఉద్యోగం



సరస్వతిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని దూబార్‌పేట్‌కు చెందిన పీవీటీజీ(ఆదివాసీ) తెగలో అత్యంత వెనకబడిన తొటి యువతి సరస్వతికి పోస్టల్ శాఖలో ఉద్యోగం లభించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దూబార్‌పేట్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆమెను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు నైతం నాగరాజు, ఉపాధ్యక్షుడు చాకటి పవన్‌కుమార్, ఆదివాసీ జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు అత్రం రవీందర్, స్థానికులు పాల్గొన్నారు.


పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ సత్యనారాయణ

ఆదిలాబాద్‌టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను వన్‌టౌన్ పోలీసులు రికవరీ చేశారు. బాధితులు ఇటీవల వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా వాటి జాడ తెలుసుకొని మంగళవారం సీఐ సత్యనారాయణ వారికి అందజేశారు. తాంసి మండలం జామిడికి చెందిన బేర్ల అజయ్, జిల్లాకేంద్రంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ఓరగంటి సుస్మిత, రాంనగర్ కాలనీకి చెందిన కానిస్టేబుల్ యాదవ్ ఉద్ధవ్ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నారు. వాటిని రికవరీ చేసి అందించినట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు హరిబాబు, అశోక్, హెడ్‌కానిస్టేబుల్ రాములు తదితరులు ఉన్నారు.

ముఖరా(కె)కు ఆర్టీసీ బస్సు సౌకర్యం



ప్రారంభిస్తున్న సర్పంచ్ మీనాక్షి

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె) గ్రామానికి మంగళవారం ఆర్టీసీ బస్సు ప్రారంభమైంది. గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులతో కలిసి సర్పంచ్ మీనాక్షి పూజలు చేసి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించిన ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం కల్పనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ గాడ్గే సుభాష్ ఉన్నారు.

'వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం'

తాంసి: బోథ్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ ధీమా వ్యక్తం చేశారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో మండలంలోని గిరిగాం గ్రామంలో నాయకులతో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. 30 మంది గ్రామస్తులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన డిక్లరేషన్ చూసి పార్టీలోకి ప్రజలు స్వచ్ఛందంగా చేరుతున్నారని అన్నారు. నాయకులు రాజావళి, గంగారం, కిషన్, హన్మండ్లు, భూమన్న, స్వామి తదితరులు ఉన్నారు.

వానొస్తే అంతే సంగతి!

- రాకపోకలు బంద్ అయ్యే అవకాశం
- తరోడ వద్ద కుంగిన వంతెన
- ప్రస్తుతం తాత్కాలిక కల్వర్టు గుండా ప్రయాణం



తరోడ వద్ద బ్రిడ్జి కింద నిర్మించిన తాత్కాలిక కల్వర్టు

జైనథ్: వానొస్తే చాలు జైనథ్, బేల మండలాల ప్రజలు ప్రయాణాలు సాగించాలంటే తిప్పలు పడుతున్నారు. ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాలను మహారాష్ట్రకు కలుపుతూ ఉన్న జాతీయ రహదారిపై తరోడ సమీపంలో గత ఫిబ్రవరి 19న సాత్నాల వాగుపై ఉన్న వంతెన కుంగిన విషయం తెలిసిందే. 2018లో ఆగస్టులో భారీ వర్షాలకు సాత్నాల, మత్తడి వాగు నీళ్లు ఒక్కసారిగా వదలడంతో వంతెన దెబ్బతింది. అప్పట్లో బ్రిడ్జిని మూసివేసి తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. ప్రస్తుతం మరోసారి బ్రిడ్జి కుంగడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. అయితే, బ్రిడ్జి కింద వాగుపై రూ.38 లక్షలతో తాత్కాలికంగా కల్వర్టు నిర్మించి, రాకపోకలకు అనుమతిస్తున్నారు. అంతా బాగానే ఉన్నా చిన్నపాటి వర్షం కురిస్తే కల్వర్టు మునిగి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఆసుపత్రులు, ఉద్యోగాలు, చదువులు, విత్తనాలు, ఎరువుల కోసం ఆదిలాబాద్ వెళ్లే జైనథ్, బేల మండలాల ప్రజలు వర్షాకాలంలో తమ పరిస్థితి ఏంటి అని ఆలోచిస్తున్నారు.

ప్రారంభం కాని విస్తరణ పనులు

జైనథ్, బేల మండలవాసులకు ఆదిలాబాద్ వెళ్లేందుకు మరో పీఆర్ రోడ్డు అందుబాటులో ఉంది. ఇది నిరాల, అడ, లాండ సాంగ్వి మీదుగా ఆదిలాబాద్ వెళ్తుంది. నిరాల–ఆదిలాబాద్ రోడ్డు ఇరుకుగా, మూలమలుపు ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు. ఈ రోడ్డు గుండా 11 కల్వర్టులు ఉన్నాయి. వర్షాకాలంలో అవి మునిగితే రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌కు నిత్యం వందలాది సిమెంట్ లోడ్‌తో లారీలు వస్తుంటాయి. ఈ రోడ్డుగుండా భారీ వాహనాలు వెళ్తుండడం ప్రమాదకరమని అంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంది. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు. అయితే ఇప్పటికే 3.75 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డును 7 మీటర్ల వెడల్పుతో బీటీ వేసేందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు రూ.30 కోట్లతో టెండర్ నిర్వహించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంకా పనులు ప్రారంభించలేదు. అధికారులు పనులు ప్రారంభించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని మండల వాసులు వేడుకుంటున్నారు.

విస్తరణ పనులు పూర్తి చేయాలి



నిరాల–ఆదిలాబాద్ సింగిల్ రోడ్డును డబుల్‌గా విస్తరించే పనులు చేపట్టాలి. ప్రతిరోజు వేలాది సంఖ్యలో జాతీయ రహదారి గుండా రాకపోకలు చేస్తుంటారు. తరోడ వద్ద బ్రిడ్జి కుంగడంతో తాత్కాలిక వంతెన నిర్మించారు. అది ప్రమాదకరంగానే ఉంది. వర్షాలు పడితే మునిగిపోతుంది. నిరాల–ఆదిలాబాద్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి. – ఏనుగు సతీశ్‌రెడ్డి, జైనథ్

వారంలోగా పనులు ప్రారంభం

నిరాల–ఆదిలాబాద్ రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లతో టెండర్ పనులు పూర్తి చేశాం. వారంలోగా పనులు ప్రారంభమవుతాయి. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తరోడ వద్ద నిర్మించిన తాత్కాలిక కల్వర్టును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. వర్షాలకు కొట్టుకుపోయినా మళ్లీ పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉన్నాం. – సుభాష్, డీఈ, ఎన్‌హెచ్ఏఐ

రాజుల్‌వాడీకి నీటి సరఫరా పునరుద్ధరణ

సాక్షి స్పందన



నల్లా ద్వారా సరఫరా అవుతున్న భగీరథ నీరు

తాంసి: భీంపూర్ మండలం కరంజి (టి) పంచాయతీ పరిధిలోని రాజుల్‌వాడీ గ్రామానికి మంగళవారం అధికారులు భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించారు. గ్రామంలోని గిరిజనులు నీటి కోసం పడుతున్న ఇబ్బందులపై తాగునీటి కష్టాలు శీర్షికన సాక్షిలో ఈనెల 10న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్ గ్రామాన్ని సందర్శించి పగిలిన పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరణ చేశారు. వాటర్ ట్యాంక్‌లో నీటిని నింపి ఇంటింటికీ నల్లాల ద్వారా సరఫరా చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ



ఉత్తర్వులు అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్, డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తున్నట్లు డీఈవో ప్రణీత తెలిపారు. దీనికి సంబంధించి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ –హెచ్ 143 ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ఫీజు రాయితీ కల్పించాలని కలెక్టర్‌ను విన్నవించగా ఈ మేరకు అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మేహతో కలిసి ఉత్తర్వు కాపీలను జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్, ప్రధాన కార్యదర్శి ఎల్.రాజుకు అందజేశారు. అర్హులైన జర్నలిస్టులు ఫీజు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రైవేట్ విద్యా సంస్థలకు ఉత్తర్వు కాపీలను పంపుతున్నట్లు డీఈఓ వివరించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఏ అన్వర్, నాయకులు డీవీఆర్ ఆంజనేయులు, మడుపు సంతోష్, కరణ్‌రెడ్డి, గజానన్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకారం

ఆదిలాబాద్‌టౌన్: కోర్టుల్లో వివిధ కేసుల పరిష్కారానికి న్యాయవాదుల సహకారం ఎంతగానో ఉంటుందని పీసీఆర్ కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గారాణి అన్నారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు ప్రధాన భూమిక పోషిస్తారని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి తమవంతుగా కృషి చేస్తామన్నారు.

జొన్న పంట కొనుగోలు చేయాలని బీజేపీ ధర్నా



రైతులతో కలిసి ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

తాంసి: రైతులు పండించిన జొన్న పంట కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డు ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. రైతులతో కలిసి నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు గతవారం రోజులుగా జొన్న పంట కొనుగోలు నిలిపివేశారన్నారు. గన్నీ బ్యాగులు, గోదాంల కొరత తదితర కారణాలతో నిలిపివేశారని అన్నారు. యార్డులో పంట కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాగా, ధర్నా విషయం తెలుసుకుని ఎస్సై లాల్‌సింగ్ నాయక్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అదుపులో తీసుకున్నారు. పార్టీ కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు సతీశ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి సుభాష్, నాయకులు సిరిగిరి మహేందర్, గంగాధర్ ఉన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



నేరడిగొండ: రికార్డులు పరిశీలిస్తున్న ఏవో బిర్రు భాస్కర్



తాంసిలో తనిఖీ చేస్తున్న ఏడీఏ రవీందర్

నేరడిగొండ/తాంసి/ఇంద్రవెల్లి/తలమడుగు/ఉట్నూర్‌రూరల్: జిల్లాలోని ఆయా విత్తన, ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, విత్తనాల ధరలు, స్టాక్ లభ్యత, తదితర వివరాలు తెలిపేబోర్డులు పెట్టాలని యజమానులకు సూచించారు. నేరడిగొండలో ఏవో బిర్రు భాస్కర్, తాంసిలో ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్, ఇంద్రవెల్లిలో ఏవో రాథోడ్ గణేశ్, తలమడుగు మండలం సుంకిడిలో ఏవో మహేందర్, ఉట్నూర్ మండలం శ్యాంపూర్, హస్నాపూర్, చాందూరి గ్రామాల్లో ఏవో గణేశ్‌లు షాపుల్లో స్టాక్ రిజిస్టర్లు, విక్రయిస్తున్న విత్తనాలను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.



సుంకిడిలో తనిఖీ చేస్తున్న ఏవో మహేందర్



ఉట్నూర్‌రూరల్: తనిఖీ చేస్తున్న ఏవో గణేశ్

కేసీఆర్, జోగు రామన్న ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రప్రభుత్వం గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మావల మండలం బట్టిసావర్‌గాం పంచాయతీ ఆవరణలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, నాయకులు గోవర్ధన్, అసుర రమేశ్, మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కుల అందజేత

తాంసి: భీంపూర్ మండలంలోని అటవీప్రాంతం తాంసి(కె), గొల్లఘాట్ గ్రామాల శివారులో గత ఫిబ్రవరిలో తిప్పేశ్వర్ నుంచి వచ్చిన పులులు ఆవులు, లేగదూడలపై దాడి చేసి హతమార్చాయి. తాంసి(కె)కు చెందిన బాధిత రైతులు స్వామి, ప్రభాకర్, శంకర్, శ్రావణ్, ప్రభు, అశోక్‌లకు రూ.లక్ష పరిహారం చెక్కులు మంజూరయ్యాయి. తాంసి(కె) పంచాయతీ కార్యాలయంలో మంగళవారం అటవీశాఖ సెక్షన్ అధికారి అహ్మద్‌ఖాన్, బీట్ ఆఫీసర్ సాయి కుమార్‌లు వారికి చెక్కులు అందజేశారు. గ్రామపెద్దలు రవీందర్, రాజు, నాగన్న తదితరులు ఉన్నారు.

బీజేపీ పాలనపై సర్వత్రా వ్యతిరేకత

- సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: బీజేపీ పాలనపై ప్రజల్లో సర్వత్రా వ్యతిరేకతే ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు దేశాన్ని వంద లక్షల కోట్ల రూపాయల అప్పుల్లోకి నెట్టివేసిందని ఆరోపించారు. ఆ అప్పుల భారం జీఎస్టీ పేరుతో వడ్డీల మీద వడ్డీలు వేస్తూ వసూలు చేస్తోందన్నారు. బీజేపీపై వ్యతిరేకతకు ప్రజాగర్జన బహిరంగ సభ విజయవంతమే ఇందుకు నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కుంటాల రాములు, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా నాయకులు మేస్రం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా సర్పంచ్‌కు సన్మానం



గాంధారిని సన్మానిస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్

ఇంద్రవెల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోరెంగా గాంధారిని మండల ఉత్తమ మహిళా సర్పంచ్‌గా ఎంపిక య్యారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయిలు ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. మండల ఉత్తమ మహిళా సర్పంచ్‌గా తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందని సర్పంచ్ తెలిపారు. ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత తదితరులు ఉన్నారు.

సన్మానం

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో తహసీల్దార్ గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్‌ను అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల నూతన కమిటీ సభ్యులు మంగళవారం సన్మానించారు. అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, ఉపాధ్యక్షుడు పవార్ శివాజీ, కమిటీ సభ్యులు సునీల్, సూర్యకాంత్, నాయకులు దిలీప్ మోరే, మారుతి, అతిష్‌కుమార్, శివాజీ, గౌతం ఉన్నారు.

యుద్ధప్రాతిపదికన వాటర్ ఫౌంటేన్ పనులు



ట్యాంకర్ల ద్వారా ఫౌంటేన్‌లో నీరు నింపుతున్న దృశ్యం

కైలాస్‌నగర్: పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో పట్టణ సుందరీకరణలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న వాటర్ ఫౌంటేన్ ప్రారంభానికి మున్సిపల్ అధికారులు కసరత్తు చేపట్టారు. ఒకటి రెండు రోజుల్లో ఈ ఫౌంటేన్ అందుబాటులోకి తెచ్చేలా యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా ఫౌంటేన్‌లో వాటర్ నింపారు. ఫౌంటేన్ అంతర్భాగంలో పచ్చదనం పెంచేలా ల్యాండ్ ఏర్పాటు చేయడంతోపాటు మొక్కలు నాటేలా చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. తెలంగాణ చౌక్‌తోపాటు పట్టణంలోని కుమురంభీం చౌక్, నేతాజీచౌక్ ఒకేసారి అందుబాటులోకి తెచ్చేలా పనులు చేస్తున్నామని డీఈ తిరుపతి తెలిపారు. చౌక్‌ల్లో పచ్చదనంతోపాటు ఆహ్లాదం వెల్లివిరిసేలా సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

'చౌక్‌ల పునరుద్ధరణపై నిర్లక్ష్యం సరికాదు'

ఆదిలాబాద్: పట్టణ సుందరీకరణలో భాగంగా శివాజీచౌక్, గాంధీచౌక్ ల పునరుద్ధరణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆమె నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొఘలులను ఎదిరించి వీరోచితంగా పోరాటం చేసిన ఛత్రపతి శివాజీ చౌక్‌ను ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. అదేవిధంగా జాతిపిత మహాత్మా గాంధీ చౌక్‌ను సైతం విస్మరించారని మండిపడ్డారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆయా చౌక్‌ల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేకు రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన టీడీపీ అధినేత ఎన్టీఆర్ విగ్రహాన్ని సైతం తీసి పక్కన పెట్టారని విమర్శించారు.

ఆదివాసీ నిరుద్యోగులతోనే సీఆర్టీ పోస్టులు భర్తీచేయాలి

ఆదిలాబాద్‌రూరల్: ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలోని గిరిజన పాఠశాలలో సీఆర్టీల పోస్టులను ఆదివాసీ తొమ్మిది తెగల నిరుద్యోగులతోనే భర్తీచేయాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్ రావ్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎడ్, బీఈడీ చదివిన ఆదివాసీ నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలని కోరారు. బెస్ట్ అవలెబుల్ పాఠశాలలో 3, 5, 9 తరగతుల సీట్లను ఆదివాసీ 9 తెగల విద్యార్థులతో భర్తీ చేయాలన్నారు. ఆయన వెంట పలువురు గిరిజన నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

జైనథ్: మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడావి గణేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తహసీల్దార్‌కు రాఘవేంద్ర రావుకు వినతిపత్రం అందించారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయాలి

జైనథ్: ఎస్సీ వర్గీకరణ కోసం వచ్చేనెలలో నిర్వహించే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లేశ్‌కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

కేటీఆర్‌ను కలిసిన ఎంపీపీ

బోథ్: ఎంపీపీ తుల శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను మంగళవారం కలిశారు. మహేందర్, అభిలాష్ ఉన్నారు.

ఆలయం కోసం భూమి కేటాయించాలి

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండ శివారులో మసేలా (మైసమ్మ) ఆలయం కోసం ఎకరం భూమిని కేటాయించాలని నాగల్‌కొండ, దేవారిగూడ, భవానిగూడ, మారప్పాగూడలోని ప్రజలు కోరారు. తహసీల్దార్ ఆర్కా మోతీరామ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

పరామర్శ

బోథ్: ధన్నూర్‌కు చెందిన రాజేందర్ పాముకాటుతో ఇటీవల మృతిచెందాడు. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. కిరణ్‌కుమార్, నారాయణరెడ్డి ఉన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: స్థానిక మైనార్టీ గురుకుల కళాశాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యూనిస్ సలీం తెలిపారు. హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లో మిగిలిన సీట్ల కోసం ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7995057874, 9553837790 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇన్సూరెన్స్ చెక్కులు అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఇన్సూరెన్స్ చేయించుకొని ఇటీవల మృతిచెందిన వారి బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ధనలక్ష్మి బ్రాంచిలో రీజినల్ మేనేజర్ గంగోని శ్రీనివాస్ మంగళవారం చెక్కులు అందజేశారు. పట్టణానికి చెందిన నదీముల్లా ఖాన్ ఎస్‌బీఐలో హౌజ్‌లోన్ రూ.38 లక్షలు తీసుకోగా మృతిచెందారు. ఆ కుటుంబీకులకు రూ.38 లక్షలు రుణమాఫీ అయినట్లు పేర్కొన్నారు. ఫిల్టర్‌బెడ్‌కు చెందిన గట్టు వినోద్ అనారోగ్యంతో మృతిచెందారు. ఎస్‌బీఐలో పీఎం జీవన జ్యోతి కింద రూ.330 బీమా చెల్లించగా కుటుంబీకులకు రూ.2లక్షల చెక్కు, జైనథ్ మండలం పెండల్‌వాడకు చెందిన ముక్కెర ఆశన్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా కుటుంబీకులకు రూ.10లక్షల చెక్కులు అందజేశారు. బాధితుడు ఎస్‌బీఐలో జనరల్ బీమా కింద రూ.500 చెల్లించడంతో ఈ ఇన్సూరెన్స్ వర్తించినట్లు పేర్కొన్నారు. చీఫ్ మేనేజర్ కిశోర్‌చంద్ర పాండ, బీఎం శివకాంత్, మార్కెటింగ్ మేనేజర్ బాలకృష్ణ, మేనేజర్లు రమేశ్, సతీశ్ కుమార్, వెంకటి, ప్రశాంత్, ప్రవీణ్, సాయికృష్ణ పాల్గొన్నారు.